# అద్దమైన పొందుగు

పార్వతి అలసిపోయింది. దానిలో ఆశ్చర్యంలేదు. అది మామూలే! కాని మామూలుగాని ఒకరకం స్తబ్దత ఆవరించింది పార్వతి మనస్సుని కృష్ణమూర్తికి పరస్తుతి ఎక్కువయినకొద్దీ పార్వతికి ఆత్మనింద ఎక్కువవుతుంది. ఈ మధ్య ఇదే జరుగుతోంది. భర్తనీ పిల్లలనీ అపరిమితంగా ప్రేమించింది. 'దాని ఫలితమేనా ఇది? ... అనుకుంటూ దారి కడ్డుగా పడివున్న కుర్రకుర్చీలు, సైకిలు, కాగితాలు, పెన్నిళ్ళు, పాత గుడ్డలు ... అన్నీ ఒకటొకటే తీసి వాటి వాటి స్థానంలో పెట్టింది పార్వతి. కాస్సేపు అమ్మదగ్గర కూర్చుని రావాలి అనుకుంది. 'ఈ ఇంట్లో వాళ్ళు నన్నేం అనుకుంటున్నారో - అతి నేర్పుగా వంటచేసి తమ సదుపాయాలు చూసే మరమనిషి అనుకుంటున్నారేమో' అని వింతపడింది.

వీధి తలుపు గడియవేసి తాళం వేసింది. మెట్లుదిగి గేటు దాటింది. వీధిలోకి వస్తూనే పక్కింటికేసి ఒకసారి చూసింది. అలా ఎప్పుడు చూసినా పార్వతి మనసు కించపడుతుంది. చక్కని చిన్నతోట పెంచింది పక్కింటి సుభద్రగారు. బారులు తీరిన పూలమొక్కలు చక్కగా పూసి ఎంతో అందంగా ఉన్నాయి. ఎప్పుడూ కృష్ణమూర్తి అంటూ ఉంటాడు. అడదే అయినా తోట చూడు ఎంత అందంగా ఉంచుతుందో' అని. శని ఆది వారాలలో తోటలో ఎండిన పూవులు కోసి పారేసే సుభద్రగారి నేర్పు పార్వతికి తెలియనిదికాదు. వారం పొడుగునా తోటవాడు పని చేస్తాడు అని కృష్ణమూర్తికి చెప్పాలనుకుని ఊరుకుంది పార్వతి.

— కె. రామలక్ష్మి —

పార్వతి కాతో ఏ పని బాధే లేదు. పెరట్లో పువ్వుల మొక్క నేది తలెత్తదు. ఒకవేళ ఏదైనా మొక్క వచ్చినా దాని వేళ్ళు ఎలా ఉన్నాయో పీకి చూసి తీరతాడు నానిగాడు. రోజూ వాడి కదేపని. పక్కింటి సుభద్రగారికి పెళ్ళి అయిందో లేదో తెలియదు ఒంటరిగానే ఉంటుంది. ఏపి ఉద్యోగం చేస్తున్నట్టు కూడా లేదు. కాని బయటికి వెళ్ళి వస్తూనే ఉంటుంది

పక్కింటి తోటకేసి చూసి మనసులోనే ఉసూరుమన్నా, పార్వతి బస్సుస్టాండు దగ్గరికి వచ్చేసరికి మామూలు స్థితికి వచ్చింది. బస్సు కోసం సుభద్రగారు కూడా నిలబడి వుంది. అక్కడ అప్సర్సలా నిలబడిన సుభద్రగారిని చూసి 'కొంచెం మంచి చీర కట్టుకుని ఉండవలసింది నేను కూడా' అనుకుంది పార్వతి

"ఏమిటీ మీరూ బయలు దేరారు?" ఆశ్చర్యంగా అడిగింది సుభద్రగారు.

"అమ్మ ఇంటికని" నెమ్మదిగా అంది పార్వతి.

"నేనలా బాలమందిర్‌లో పిల్లల్ని చూసివద్దాం అని బయలుదేరాను. అబ్బ! ఎంత ముద్దొస్తుంటారండీ" అంది సుభధ్రగారు

"పిల్లలంటే అంత ఇష్టమైతే తన కుటుంబమే విస్తరించుకోవచ్చుగా" అనుకుంది పార్వతి.

"మిమ్మల్ని చూస్తూంటే ఆశ్చర్యం వేస్తుంది. ఇంట్లో క్షణం విశ్రాంతి ఉండదనుకుంటాను" సానుభూతి ప్రకటించింది.

"ఉండకేం ఉంటూనే ఉంటుంది. అయినా విశ్రాంతి ఏం చేసుకుంటాను?" అంది పార్వతి.

"అదేమిటి సంఘసేవ చేయవచ్చుగా" నవ్వుతూ అంది సుభద్రగారు.

పార్వతి ఆ క్షణంలో తన భర్తని పిల్లలని జ్ఞాపకం తెచ్చుకుంది. ఒక్క క్షణం తను లేకపోతే ఇల్లు తల్లక్రిందులై పోతుంది ఎక్కడ పని అక్కడే ఆగిపోతుంది అంతేకాదు. అందరూ తనమీద విరుచుకుపడతారు! తనకి తెలియకుండానే పార్వతి నిట్టూర్చింది.

సుభద్రగారు మాటకలపకపోతే అలాగే తన ఆలోచనలలో పడిపోయేదే పార్వతి.

"రేపురాత్రి మీరు, మీ ఆయనా మా ఇంటికి భోజనానికి రావాలి" అంది సుభద్రగారు.

"ఏమిటి విశేషం?" నవ్వుతూ అడిగింది పార్వతి.

"ఏదైనా విశేషం లేకుంటే రారా? సరదాగా కబుర్లు చెప్పుకుంటూ భోజనం చేద్దాం" అంది సుభద్రగారు.

"చెప్తాను" అంది పార్వతి.

"చెప్పడంకాదు. రావడమే



"అదిగో వచ్చేది నా బస్సే" అంటూ బస్సుకోసం ముందుకి సాగింది సుభద్రగారు. ఆవిడకి అందరూ దారి విడిచారు. సుఖంగా బస్సు ఎక్కేసింది.

పార్వతి క్లాస్మేటు తల్లితో కబుర్లు చెప్పి బాబీని స్కూలునుంచి తీసుకుని ఇంటికి వచ్చేసింది. ఆ రాత్రి భోజనాలు అయిపోయాయి. కృష్ణమూర్తి సిగరెట్ కాలుస్తూ పేపరు చూసుకుంటున్నాడు మధ్యలో పార్వతి తమలపాకులు చిలకలు చుట్టి నోటికి అందిస్తోంది.

"రేపు రాత్రి మనం ఎక్కడికి వెడుతున్నామో ఊహించు చూద్దాం" అంది కృష్ణమూర్తితో.

"వెడుతున్నామా? ఎక్కడికి? నాకు క్లబ్బులో బ్రిడ్జి ఉంది."

"అయ్యో అలా అంటే ఎలా? వస్తామని చెప్పానే" చిన్నబుచ్చుకుంటూ అంది పార్వతి.

"ఏమిటీ గొడవ? గత పదేళ్ళలో ఒక్కరోజుకూడా నువ్వు అయ్యో అనడం వినలేదు నేను" అన్నాడు కృష్ణమూర్తి.

"టైము లేక పోయింది! పిల్లల్ని కనడానికీ పెంచడానికీ సరిపోయింది. అంచేత నీ క్లబ్బు కార్యక్రమాల వివరాలు తెలుసుకో లేక పోయాను!" వ్యంగ్యంగా అంది పార్వతి. సిగరెట్ క్రిందపారేసి భార్యకేసి వింతగా చూశాడు కృష్ణమూర్తి. "ఇప్పుడేమైంది? ఇద్దరూ స్కూల్‌కి వెళ్ళిపోతున్నారుగా?" అనునయంగా అన్నాడు.

"బాబిగాడు సరిగ్గా మూడు గంటలు ఉంటాడు స్కూల్లో. మూడున్నర అయేసరికి నానిగాడు వస్తాడు. వాళ్ళ గోల భరించడానికి ఒక రోజుకి వారం రోజుల శక్తి కావాలి" అంది పార్వతి.

కృష్ణమూర్తి సన్నగా నవ్వుకున్నాడు. "నానిగాడు నా పోలిక. వాడి ఘనత వినడానికి ప్రేక్షకులు కావాలి. నువ్వు వాడి ముఖ్య అతిథివి" అన్నాడు.

"పోనీలే ఎక్కడికి వెళ్ళాలని... చెప్పు" అడిగాడు.

"పక్కింటి సుభద్రగారు భోజనానికి పిలిచారు" సగం ఉత్సాహం చచ్చిపోగా అంది పార్వతి.

"ఆ—నైన్ గాల్!" అన్నాడు కృష్ణమూర్తి.

"గాల్. నా ముఖం. నిరభ్యంతరంగా నా వయస్సు వుంటుంది ఆ పిల్లగారికి!" అంది ఘాటుగా.

"పాపం. ఒకర్తెకే ఏం తోచడం లేదు కాబోలు. అలాగే వెడదాం" అన్నాడు పేపరులో తలదూర్చేస్తూ.

దగ్గరలో ఏం దొరికితే అది ఆ క్షణంలో కృష్ణమూర్తిమీదికి విసరా

అన్నంత కోపం వచ్చింది పార్వతికి. గట్టిగా అరవాలనిపించింది. కాని అవేం చేయలేదు. "అంత తోచకుండా లేదు లే. కాలక్షేపానికి సంఘసేవలాంటిది చేస్తూ ఉంటుందట. మరినీ క్లబ్బు మాటు?" అడిగింది పార్వతి. "ఆ బురంపుణాను లే. ఇంకో పార్ట్నర్ని చూసుకుంటాడు" అన్నాడు కృష్ణమూర్తి. "ఈ రోజు బస్సులో కనిపించింది" అన్నాడు. "రేపు రాత్రికి కొత్తచీర కొని వుంటుంది?" హేళనగా అంది పార్వతి. "మంచి చలాకీ అయిన వ్యక్తి. ఎంత జాగ్రత్తగా డ్రస్ చేసుకుంటుందో చూశావా?" సీరియస్గానే అన్నాడు కృష్ణమూర్తి. దాంతో వచ్చింది అసలు చిక్కు.

ఎదుటి స్త్రీని అంత పొగిడితే ఎంత భార్య అయితేమటుకు ఎంత కాలం భరిస్తుంది? విందుకు వెళ్ళినప్పుడు ఎలాగైనా సరే సుభద్రగారిని తలదన్నాలని నిశ్చయించుకొంది పార్వతి.

రాత్రి పిల్లలకి ఇట్టే నిద్రపట్టేసింది—పార్వతి లాలిపాటతో.

పార్వతి మెదడు పరిపరి విధాల ఆలోచనలు చేస్తూంది. తనూ ఏమైనా చేస్తే తప్పించి లాభంలేదనుకుంది. పెట్లో డబ్బుంది. కాని దానికెంతో అవసరం వుంది. కుర్రాళ్ళకి గుడ్డలు కుట్టించాలి. నానిగాడికి బూట్లు కొనాలి. మధ్యలో పుట్టిన రోజులు వస్తాయి. డాక్టరు అవసరాలు వస్తాయి... కాని పార్వతి చెవుల్లో కృష్ణమూర్తి మాటలే మార్మోగుతున్నాయి. 'ఎంత జాగ్రత్తగా డ్రస్సు చేసుకుంటుందో చూశావా?' అన్న అతని మాట ములుకులా పార్వతి హృదయాన్ని తొలిచింది. 'ఖర్చులు ఉండనీ. వాటి గొడవెందుకు?' అని నిశ్చయించుకుంది. 'తెల్లవారనీ' అనుకుని తృప్తిగా నిద్రపోయింది.

మరునాటి ఉదయం పెందరాడే లేచింది పార్వతి. చాలా సింపుల్గా చేసి అయిందనిపించింది వంట.

'ఏమిటీ ఒకటే హడావిడిగా ఉన్నావు?' వేళాకోళం చేస్తూ భార్య బుగ్గమీద చిటికె వేశాడు కృష్ణమూర్తి.

'నేను బజారుకి వెడుతున్నాను' క్లుప్తంగా సమాధానం చెప్పింది పార్వతి.

భర్త ఆఫీసుకీ, పిల్లలు స్కూల్కీ వెళ్ళారు పదిగంటలకల్లా వీధితలుపు తాళం వేసింది పార్వతి. తిన్నగా "వర్ణాలి'కి వెళ్ళింది. చక్కని జరీ చీర కొంది. ఊనుకి బస్సు ఎక్కింది. చక్కని నవరం కొంది. ఎన్నాళ్ళనుంచో ఉందా కోరిక — పొడుగ్గా వాలుజడ వేసుకోవాలని. కాని ధైర్యం చేయలేక పోయింది కాని ఈ రోజుకి — కావలసిన తెగింపు వచ్చింది.

సాయంత్రం పిల్లలు ఇంటికి వచ్చాక వాళ్ళకి భోజనాలు సిద్ధం చేసింది. నూకాలుని వాళ్ళకి సాయం వుండమంది. నూకాలు ఉట్టినే కూర్చోదు. చక్కగా మల్లెలు, దవనం కలిపి దండ కట్టింది పార్వతికోసం. అందంగా తల దువ్వి వాలుజడ వెనకని మాలపెట్టుకుంది. కొత్త చీర కట్టి తగిన పొట్టిచేతుల రవికె తొడిగింది. కళ్ళకు కాటుక దిద్దింది. అందంగా తయారై కృష్ణమూర్తి కోసం ఎదురు చూస్తూ కూర్చుంది.

తండ్రి కారు చప్పుడు కాగానే వీధిలోకి పరుగెత్తారు నానిగాడూ బాబిగాడూ. 'న్నారూ, అమ్మ కొత్తమ్మ' అన్నాడు బాబిగాడు. 'ఔను నాన్నా బ్యూటిఫుల్‌గా ఉంది' అన్నాడు నానిగాడు. 'అలాగా చూద్దాం' అంటూ లోపలికి వచ్చాడు కృష్ణమూర్తి. కుర్రవాళ్ళు ఆటలో పడిపోయారు. పార్వతి పడగ్గదిలో అద్దంముందు కూర్చుని చూసుకుంటోంది. 'పార్వతీ' అంటూ లోపలికి అడుగుపెట్టి అలాగే నిలబడిపోయాడు కృష్ణమూర్తి. పోకిరీ కుర్రవాడిలాగా ఒక ఈలవేసి భార్య దగ్గరకి వచ్చాడు.


# ఐటెక్స్

సౌందర్యానికి సహాయకారులు



★ ఐటెక్స్ కాటుక
పసిపిల్లలకు కూడా చాలా మంచిది

★ ఐటెక్స్ బిందీ
కంటికింపైన రంగులలో లభించును.




★ ఐటెక్స్ కుంకుం పేస్టు

అరవింద్ లేబొరేటరీస్,
పి. బి. 1415 — మద్రాసు — 17.

పార్వతి ఎంత అందంగా తయారైందో మనసులో అంత బాధపడుతోంది. కృష్ణమూర్తి ఈ పొగడ్తతో కళ్ళనీళ్ళ పర్యంతం అయింది. నీరు కమ్మిన కళ్ళతో కృష్ణమూర్తికేసి చూసింది. భార్యని చేతులలోకి తీసుకుని గుండెలకదుముకున్నాడు కృష్ణమూర్తి. ఎప్పుడూ నిశ్చలంగా నిజాన్ని చాటిచెప్పే ఆమె కళ్ళలోకి సమాధానం కోసమో అన్నట్టు చూశాడు.

దృష్టి పక్కకి మళ్ళించుకుంటూ అంది పార్వతి "నువ్వు అస్తమానూ అంటూనే ఉన్నావు. ఎంత అందంగా డ్రెస్ చేసుకుందో అంటూ ... నే భరించలేక పోయానుకాబోలు... ఈవేళ ఒళ్ళు తెలియలేదు..." నవ్వుకుంటూ నిజం చెప్పేసింది పార్వతి.

"పార్వతీ నువ్వెంత అందంగా ఉన్నావోయ్" పెదవులపై మృదువుగా ముద్దుపెట్టుకున్నాడు.

"ఉన్న డబ్బంతా ఖర్చుచేశాను" అంది పార్వతి నీరసంగా.

"మంచిపని చేశావు. నేనూ కొంత ఖర్చుచేసి – ఈ చీరకి కాదు – నీకుతగ్గ ఓ నెక్లెస్ తెచ్చాను" జేబులోంచి పల్చని పెట్టెతీశాడు కృష్ణమూర్తి.

"ఎందుకలా చేశావు?" అంటూనే అతని గుండెల్లో తలదాచుకుంది పార్వతి.

"అందులో స్వార్థం లేక పోలేదు ... అయితే ఒక సంగతి..." ఆగాడు కృష్ణమూర్తి.

"ఏమిటి?" ఆత్రంగా అతని ముఖంలోకి చూసింది పార్వతి.

"ఈ రాత్రికి సుభద్రగారిని మరుగున పడేయడం అయితే నీ చిన్న జడ నువ్వు వేసేసుకుంటావా?"

"పెద్దజడ ఆడవాళ్ళకి అందం అంటారుగా" వస్తున్న నవ్వు ఆపుకొంటూ అంది పార్వతి.

"గొర్రె తోకలా ఉన్నా నాకు నీ పొట్టిజడే ఇష్టం."

భార్య మెడలో తెచ్చిన నెక్లెస్ పెడుతూ తెల్లని కంఠాన్ని ముద్దు పెట్టుకున్నాడు కృష్ణమూర్తి. "నా కళ్ళకి నువ్వెలా వున్నా అందంగా వుంటావు పార్వతీ ఈ సంగతి ఎప్పుడేనా చెప్పానా?" అడిగాడు.

"చెప్తే ఇంత గొడవే వచ్చేది కాదు" అంది కృష్ణమూర్తి కళ్ళలోకి చూస్తూ.

"అదీ మనమంచికే వచ్చింది" భార్యని ఇవతలికి నడిపిస్తూ అన్నాడు కృష్ణమూర్తి.

అప్పుడే బాగా చీకటిపడింది.

పోయిన ఆత్మవిశ్వాసం తిరిగి రావడంతో హుందాగా భర్త వెంట పక్కింటికి నడిచింది పార్వతి.

***